తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ సోమవారం 25 - 05 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 2

# విత్తన పరీక్షలతో నకిలీలకు చెక్

- నాణ్యత లేని విత్తనాలతో రైతులపై ఏటా కోట్లాది రూపాయల ఆర్థిక భారం
- కల్తీల గుర్తింపుకు సులువైన విత్తన పరీక్షలు
- విత్తన కొనుగోలు రశీదులు జాగ్రత్తగా ఉంచుకోవాలి

ప్రజావారధి/మోత్కూరు

విత్తును బట్టే పంట అంటారు పెద్దలు. మనం సాగు చేయబోయే పంటకు సంబంధించి మనం ఎన్నుకున్న విత్తనం మంచిదైతేనే ఆ పంట మంచి దిగుబడి వచ్చి కర్షకులకు అనుకున్నంత లాభాలను ఇవ్వగలుగుతుంది. విత్తన ఎంపికలో రైతులు ఏమరపాటులో చేసే చిన్న చిన్న పొరపాట్ల కారణంగా రైతు కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కుంగిపోవాల్సి వస్తుంది. ఖరీఫ్ సాగు కొరకు విత్తనాల కొనుగోలు ఊపందుకున్న తరుణంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల ఐక్యవేదిక రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎం.అశోక్ కుమార్ ఈ క్రింది సూచనలు చేస్తున్నారు.

## అప్రమత్తతే శ్రీరామరక్ష

ఖరీఫ్ పంట కాలం ప్రారంభం అవ్వడంతో ప్రస్తుతం మార్కెట్లో విత్తన కొనుగోలు జోరుగా సాగుతోంది. రైతులు తమకు కావాల్సిన విత్తనాలను తమకు తెలిసిన విత్తన వ్యాపారుల వద్ద నుండి లేదా డీలర్ షాపుల నుండి కొనుగోలు చేస్తున్నారు. విత్తన కొనుగోలు సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యాపారులు బాగా తెలిసిన వారైనా సరే విత్తన కొనుగోలుకు సంబంధించిన రశీదును రైతులు తప్పనిసరిగా అడిగి తీసుకోవాలి. రశీదుపై రైతు పేరు, గ్రామం, విత్తన రకం, లాట్ నంబరు, కొనుగోలు ధర వంటి విషయాలు రాయించుకోవాలి. భవిష్యత్‌లో మనం కొనుగోలు చేసిన విత్తనంలో ఏవైనా జన్యు పరమైన లోపాలు వచ్చినా లేదా అవి నకిలీవి అని నిర్ధారణ అయిన సందర్భంలో విత్తన వ్యాపారుల నుండి రైతుకి నష్ట పరిహారం



ఇప్పించడంలో ఈ విత్తన కొనుగోలు రశీదు ప్రముఖ పాత్ర పోషిస్తుంది.

## అధీకృత డీలర్ల నుండే విత్తన కొనుగోలు ఉత్తమం

విత్తనాలను ఎప్పుడూ వ్యవసాయశాఖ వారి నుండి అధికారికంగా విత్తన లైసెన్సులు పొందిన డీలర్ షాపుల నుండి కొనుగోలు చేయడంతో రైతులు మోసాల భారిన పడే అవకాశాలను తగ్గించుకోవచ్చు. చిరిగిన లేదా తెరిచి ఉన్న విత్తన ప్యాకెట్ల కొనుగోలును రైతులు తిరస్కరించాలి. కొనుగోలు సమయంలో విత్తన ప్యాకెట్లపై విత్తన రకం, మొలక శాతం, స్వచ్ఛత శాతం, లాట్ నంబరు, అమ్మకం ధర, విత్తన పరీక్ష చేసిన తేదీ వంటి కనీస వివరాలు ఉన్నాయో లేదో చూసుకుని కొనుగోలు చేయాలి. కొన్ని రకాల కంపెనీలు తమ ఒరిజినల్ విత్తన ప్యాకెట్లను గుర్తించడానికి టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేశాయి. విత్తన ప్యాకెట్లపై ఉన్న క్యూ-ఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా కూడా ఆ విత్తనానికి సంబంధించిన వివరాలను తెలుసుకోవచ్చు.

## విత్తే ముందే మొలక శాతం పరీక్ష చేసుకోవాలి

రైతులు మార్కెట్లో కొనుగోలు చేసిన విత్తనాలను నేరుగా పంట చేలల్లో విత్తుకోకుండా రైతు స్థాయిలోనే విత్తన మొలక శాతం పరీక్షలు చేసుకోవాలి. ప్యాకెట్‌ను కొద్దిగా తెరచి ఒక 100 గింజలు నాటితే కనీస మొలక శాతం వరికి 80శాతం ఉండగా, మొక్కజొన్నకు 90శాతం, పత్తికి 65శాతం, నూనె గింజ పంటలకు 70శాతం మొలకలు వస్తున్నాయా లేదా అన్నది పరీక్షించుకున్నాకే ప్రధాన పంట చేనులో విత్తుకోవాలి. పంటల సాగు పూర్తయ్యే వరకు మొక్కల ఎదుగుదలలో రైతులు ఏవైనా లోపాలను గమనించినట్లయితే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తే తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.



ఎం.అశోక్ కుమార్
-తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల ఐక్య వేదిక రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
సోమవారం
జనరల్ న్యూస్
25 - 05 - 2026


## పెట్రో ధరలు పెంచి..

# ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వం

### సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు



- ధరల భారంతో ఆర్థిక ఇబ్బందులతో నలిగిపోతున్న పేదలు
- పెంచిన పెట్రోల్, డీజిల్, సీజీఎస్ గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి

ప్రజావారధి/మోత్కూరు
కేంద్ర ప్రభుత్వం ఇష్టారాజ్యంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపుతుందని సీపీఎం మోత్కూరు మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే పశ్చిమాషియాలో తలెత్తిన యుద్ధం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెట్రోల్ పై లీటరుకు రూ 3.14 పైసలు, డీజిల్ పై లీటరుకు రూ 3.11 పైసలు, సీజీఎస్ గ్యాస్ పై లీటరుకు 2 రూపాయలు పెంచడమే కాక ఎనిమిది రోజుల వ్యవధిలోనే మూడుసార్లు సగటున లీటరకు 90 పైసల చొప్పున పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం సమంజసం కాదన్నారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే మోడీ ప్రభుత్వం ప్రజలపై పెట్రోల్, డీజిల్ భారం మోపిందని, ధరలు పెంచమని గొప్పలు చెప్పిన ప్రధాని మోడీ ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రజలపై ధరల భారం మోపడం దేశ ప్రజలను దగా చేయడమేనని విమర్శించారు. ధరల పెంపు రవాణా, వ్యవసాయ రంగాలపై ఎక్కువ ప్రభావం చూపే ప్రమాదం ఉందని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.